క్రమక్రమంగా సర్వ సంశయాలను, అపమార్గాలను జయిస్తాడు. అందుకనే 'అభ్యాసము కూస విద్య' అన్నారు. షేక్స్‌ఫియర్ "వివేకవంతుడు సంస్కరించబడిన బుద్ధిగలవాడు, సూక్ష్మబుద్ధి గలవాడు, మంచితనం గలవాడు మాత్రమే తన స్వరూపాన్ని తెలుసుకొనే బుద్ధి కలుగుతుంది" అన్నారు. శ్రీనాన్నగారు అన్నారు "విచక్షణ వల్ల వచ్చే వైరాగ్యం వల్లనే మనస్సు నిలబడుతుంది. భోగచింతన విడిచిపెట్టకుండా మోక్షం రాదు" అన్నారు. విచక్షణా బుద్ధిని వృద్ధి చేసుకొని అజ్ఞానాన్ని తరిమికొట్టాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**

## సద్గురునాన్నగారి అనుగ్రహభాషణములు, 07-08-05, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవంతుడిని స్తోత్రం చేయటం వలన మనకు ఏమి కలిసివస్తుంది అనుకుంటాము. భగవంతుడిని స్తోత్రం చేయటం వలన మనం పవిత్రులమవుతాము, ఆత్మజ్ఞానానికి అర్హులవుతాము. పోతనామాత్యుడు వ్రాసిన పద్యాలు పూర్వం అందరూ చదివేవారు. మనస్సును సంస్కరింపచేయటానికి ఆపద్యాలను కంఠస్తం చేయించేవారు. మనకు నోటికి రావటంవలన లాభం ఏమిటంటే అవి జ్ఞాపకం వచ్చినప్పుడు మనం పవిత్రులమవుతాము. ఇప్పుడు ఆసాహిత్యం లేదు, ఆసంస్కృతి లేదు. అర్జునుడు పరమాత్మను స్తోత్రం చేస్తూ పరబ్రహ్మం, పరంధామం, పవిత్రం అంటాడు గీతలో. ఇదివరకు ఎవరో చెపుతూంటేవిన్నాను. ఇపుడు నేను స్వయంగా చూస్తున్నాను అంటాడు అర్జునుడు. మన ఇంద్రియాలకు అందనిది, మనస్సుకు అందనిది, మనదేహభావనకు అందనిది ఒక శక్తి ఉంది, అదే ఈ నక్షత్రాలను, గ్రహాలను, సమస్తసృష్టిని మిమ్మల్ని, నన్ను అందరిని నడుపుతోంది అని ఐన్‌స్టీన్ చెప్పాడు. దీనినే జ్ఞానులు బ్రహ్మం అంటారు, భక్తులు నారాయణుడు అంటారు. మనకు తల్లి గర్భంలో ఉండగానే 7వ నెలలోనే అహంభావన ప్రారంభమవుతుందని ఋషులు చెప్పారు. ఋషులు ఎలా చెప్పారంటే వారికి అతీంద్రియ జ్ఞానం ఉంటుంది. మీపూర్వజన్మలు అన్నీ చెప్పగలను అని భగవాన్ ఒక సందర్భంలో అంటారు కాని దానివలన ప్రయోజనం ఏముంది? మీరు ఈజన్మలోని కష్టాలే భరించలేకపోతున్నారు, ఇంక పూర్వజన్మలోని కష్టాలు మీకు జ్ఞాపకం చేస్తే ఇంక మీకు దుఃఖం మిగులుతుంది. ఈదేహం ఎంతనిజమో, లోకం ఎంతనిజమో, మనస్సు ఎంతనిజమో ఈ జన్మలుకూడా అంతేనిజం. మనం అజ్ఞానంలోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యాలికాని పూర్వజన్మలు, రాబోయేజన్మలు తెలుసుకోవటంవలన ఏమీ ప్రయోజనం లేదు. కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడంటే ఈ సృష్టి ప్రారంభమయ్యాక ఏజీవకోటి ఈభూమిమీదకు వచ్చిందో నాకు తెలుసు, ప్రస్తుతం ఉన్న జీవకోటి అందరిగురించి

నాకు తెలుసు, రాబోయే జీవకోటిగురించి నాకు తెలుసు అర్జునా అని చెప్పాడు, కాని నీకు నాకు తేడా ఏమిటంటే అది అంతా నాకు తెలుసు, నీకుతెలియదు అంతే తేడా అని పరమాత్మ చెప్పాడు. అజ్ఞానికి ఈగోడప్రక్కన ఏమిఉందో తెలియదు, జ్ఞానికి అంతా గోచరిస్తూ ఉంటుంది. జ్ఞాని అంతా తానై ఉంటాడు కాబట్టి అంతా ఆయనకు గోచరిస్తూ ఉంటుంది. తాను కనిపెట్టిన సిద్ధాంతాలవలన మానవజాతికి మంచికంటే చెడు ఎక్కువ జరుగుతోంది అని ఐన్‌స్టీన్ చివరిరోజుల్లో దుఃఖపడేవాడు. ఐన్‌స్టీన్ శాస్త్రవేత్త మాత్రమే కాదు, ఆయన ఉత్తమోత్తముడు. మనం అజ్ఞానంలో ఉన్నాము అన్న సంగతి ముందు మనకు తెలియాలి, చాలామంది అజ్ఞానంలో ఉండి మేము జ్ఞానంలో ఉన్నాము అనుకొంటున్నారు, ఇది చాలా ప్రమాదం అని ఆయన చెప్పాడు. సైన్స్‌తో సంబంధంలేని మతం గుడ్డిది, ఆత్మవిద్యతో సంబంధంలేని సైన్స్ కుంటిది అని ఆయన చెప్పాడు. మనకు సైన్స్, ఆత్మవిద్య రెండూ ముఖ్యమే అని ఆయన చెప్పారు.

మీకు జ్వరం వస్తూ ఉంటే దానికి కారణం ఉంటుంది. కార్యం స్థూలంగా ఉంటుంది, కారణం సూక్ష్మంగా ఉంటుంది. మనకు దుఃఖం వస్తోంది అనుకోండి దానికి కారణంలోపల ఉంటుంది. దుఃఖం రావటం అనేది ఎఫెక్టు అంటే రిజల్టు దానికేదో లోపల కారణం ఉంటుంది, అది పూర్వజన్మలలో కారణం అయిఉండవచ్చు. కారణం లేకుండా దుఃఖం రాదు. ఈ కాజ్ అండ్ ఎఫెక్టు థియరీ మనకు అర్థమయితే దోషాలకు దూరంగా ఉంటాము, ఈ దోషాలు చేయటంవలన పరిణామంలో ఎంత ప్రమాదం వస్తుందో మనకు తెలుస్తుంది. అందుచేతనే కాజ్ అండ్ ఎఫెక్టు థియరీని విశ్వశించేటట్లుగా ప్రజలకు చెప్పండి అని బుద్ధుడు చెప్పాడు. వారు చేసేదోషాలవలన పరిణామంలో వచ్చే ప్రమాదాలు వారికి తెలియాలి. దుఃఖకారణం మనకళ్ళకు కనబడకపోవచ్చు అది ఎక్కడో అంతరాంతరాళాలలో ఉంటుంది. దానిని తొలగించుకొంటే గాని ఈదుఃఖం పోదు. ఆత్మవిద్య అందరికి సాధ్యమే. అది ఎవరో ఒకరి సొంతంకాదు, అందరూ ఆత్మవిద్యను పొందవచ్చు. మీరు అరుణాచలం ఎలా వచ్చారు అని భగవాన్‌ను అడిగితే మీరు అందరూ ఎలావచ్చారో నేను అలానే వచ్చాను అని చెప్పారు. మీకు జ్ఞానం వచ్చింది కదా మరి మామాట ఏమిటి అని అడిగితే ఎవరైతే నాకు జ్ఞానాన్ని ప్రసాదించారో వాడే మీకూ జ్ఞానాన్ని ఇస్తాడు అని చెప్పారు, అది యూనివర్సల్ లవ్, అది ఆత్మజ్ఞానం వలననే సాధ్యం.

సన్యాసం అంటే బట్టలు మార్చుకోవటంకాదు, ఇల్లు విడిచిపెట్టి పోవటంకాదు. నువ్వు నీ కుటుంబసభ్యులను ఎలా ప్రేమిస్తున్నావో అలాగ ఒక కులంతోగాని, మతంతోగాని, భాషతోగాని, ప్రాంతంతోగాని సంబంధంలేకుండా మొత్తం సృష్టినంతా నువ్వు ప్రేమిస్తే అపుడు

నువ్వు సన్యాసివి. కోరిక లేకుండా పని చేసేవాడు సన్యాసి, కర్మఫలకాంక్షలేనివాడు సన్యాసి అని పరమాత్మ చెప్పాడు. మనం ఏదైనా ఒక సబ్జక్టును జనరల్‌గా చదివితే అంతా మనకు తెలిసిపోయింది అనిపిస్తుంది కాని మనందాని యొక్క లోతులకు వెళ్ళిచూస్తే మనకు తెలిసినది చాలాతక్కువ, తెలియనిది చాలా ఎక్కువ ఉంది అని మనకు తెలుస్తుంది. ఉన్నది ఒక్కటిఅంటే ఒక్కటే, అసలు రెండవది లేదు అని అజాతవాదంలో చెపుతారు. సాధనలేదు, సాధకుడులేడు, చావులేదు, పుట్టుకలేదు, ప్రపంచం లేదు, ఎవ్వరూలేరు, ఉన్నది ఒక్కటే అని చెపుతారు. దేహం మరణిస్తుంది, మరణించే దేహంనీవు కాదు. లోపల ఉన్న వాసనలను బట్టి మనస్సు చలిస్తూ ఉంటుంది, చలించే మనస్సు నీవుకాదు. నీవు ఆత్మవే. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే మిగిలినది అంతా నీ మనస్సుయొక్క కల్పితం. ఇలా అనుకోండి, ఇలా ఊహించుకోండి అని భగవాన్ చెప్పరు, ఆయన బోధనలో అనకోవటాలు ఊహించు కోవటాలు లేవు. నేను ఉన్నానని ఈ దేహం ఇంతవరకు ఎవరితోను చెప్పలేదు, నేను ఉన్నానని ఈ ప్రపంచం ఎవరితోనూ చెప్పలేదు. నేను ఉన్నానని దేవుడు చెప్పటంలేదు. దేహం ఉందని, లోకంఉందని, దేవుడు ఉన్నాడని నీవుచెపుతున్నావు. ఆచెప్పేవాడు ఎవడు? మనందరకు కూడా ఎవరిదేహం అంటేవారికి చాలాఇష్టం, దానికోసమే మనంచాలామందితో పేచీలు పెట్టుకుంటాము, కాని అది మనలను మోసంచేసి, విడిచిపెట్టి వెళ్ళిపోతుంది.

ధూర్జటి శ్రీకాళహస్తీశ్వరశతకంలో ఏమి చెప్పాడంటే 100 సం॥లు బతికినవాడుకూడా ఇంకాబతకాలని, డాక్టరును నమ్ముతున్నాడు, మందులను నమ్ముతున్నాడు, ఏవో గ్రహాలను నమ్ముతున్నాడు కాని భగవంతుడుని విశ్వసించటంలేదు. భగవంతుడిని స్మరించటంలేదు. నన్ను అజ్ఞానంలోనుండి విడుదలచేసి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించు అని ప్రార్ధనచేయటంలేదు, 100 సంవత్సరాలనుండి ఈ ప్రపంచాన్ని చూస్తున్నావు. ఇంకా ఎన్నాళ్ళు చూస్తావు, ఊరుపొమ్మంటోంది, వల్లకాడు రమ్మంటోంది అయినా నారాయణ స్మరణచేసుకోవాలనే బుద్ధి నీకు రావటంలేదు అన్నాడు ధూర్జటి. నీవు పరమపవిత్రుడవు కృష్ణా, నీలీలలు వినటంవలన, నీరూపాన్ని ధ్యానించటంవలన, నీనామాన్ని స్మరించటంవలన మేము పవిత్రులవుతాము. ఆత్మజ్ఞానం వలన మనకు శాంతి కలుగుతుంది, శక్తి కలుగుతుంది. అది అందరికి సాధ్యమే. దానికి కృషి చేయాలి. మనం ఏవస్తువు నయితే పొందాలి అనుకుంటున్నామో దాని గురించి శ్రవణంచెయ్యాలి. అలా శ్రవణం చేయగా చేయగా దానిరుచి మనకు తెలుస్తుంది. దానిని పొందాలి అనే బుద్ధిమనకు కలుగుతుంది. మన హృదయంలో ఉన్న సద్వస్తువుయొక్క అనుభవాన్ని పొందటానికి తగిన యోగ్యత సంపాదించటానికే మంచివిషయాలు శ్రవణంచేయటం, సత్పురుషుల సహవాసంచేయటం,

పూజ జపం ధ్యానం ఇవి అన్నీ కూడా దాని కోసమే. ఉపనిషత్తులలో సేవ, త్యాగంగురించి చెప్పాడు. నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నువ్వు ధనవంతుడివి అవ్వవచ్చు, ఇతరులకు సహాయసహకారములు అందించే శక్తి నీకు ఉండవచ్చు, అధికారం రావచ్చు ఇవన్నీ నీవు పవిత్రుడవు అవ్వటానికి ఉపయోగించుకో. నువ్వు పదిమందికి సహాయంచేసావు అనుకో నేను ఏదో ఎక్కువవాడిని అని, వారు తక్కువవారని అనుకొంటే నువ్వు అజ్ఞానంలో కూరుకొనిపోతావు. నువ్వు పవిత్రుడవు అవ్వాలంటే స్వాతిసయం ఉండకూడదు.

మనం కొన్ని పాఠాలు నేర్చుకోవటానికి ఈ భూమి మీదకు వచ్చాము. గ్రంధాలు చదవటంకంటే జీవితంలో అనుభవం ద్వారా తెలుసుకునే విషయాలు కొన్ని ఉంటాయి. మనచేత చూడబడే ఈ ప్రపంచం మంచిది కాదు, చెడ్డది కాదు. అద్దంలో నీ ముఖాన్ని చూసుకుంటున్నావు. నీ ముఖం శుభ్రంగా ఉందా, నీ ముఖం మీద దుమ్ముందా అనేది అద్దం చూపిస్తుంది. నీముఖంలో ఉన్నదే చూపిస్తుంది లోకంకూడా అటువంటిదే. నీలో ఉన్న ప్లస్ పాయింట్లు ఏమిటి, మైనస్ పాయింట్లు ఏమిటి అనేది లోకం చూపిస్తుంది. ఈ భూమి మీదకు వచ్చినందుకు ఈ లోకాన్ని ఉపయోగించుకుని నీలోని ప్లస్ పాయింట్లు ఏమిటి, మైనస్ పాయింట్లు ఏమిటి అని తెలుసుకొని ప్లస్‌పాయింట్లు వలన స్వాతిసయం పెట్టుకోకుండా, నీలో మైనస్ పాయింట్లు ఉంటే వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. నీలోని బలహీనతలను లోకం చూపిస్తుంది. ప్రయత్నంచేసి ఆ బలహీనతలను తొలగించుకొంటే నీలోపల ఉన్న సద్వస్తువు తనంతటతానుగా నీకు వ్యక్తమవుతుంది. లోపల ఉన్న సద్వస్తువు అది తెలుసుకొనేది కాదు, అది తెలియబడేది. అది నీ ఇంద్రియాలకు, మనస్సుకు, బుద్ధికి, తెలిసేది కాదు, దానికి ఎవరి మీద అయితే దయ కలిగిందో అది వారికి తెలియబడుతుంది. భగవంతుడిలో చాలా గొప్ప గుణాలు ఉంటాయి. ఆయనలో ఉన్న దయాగుణం రూపం దాల్చితే వాడే గురువు. గురువుకు రక్షించటమే కాని శిక్షించటం లేదు. తప్పిపోయిన గొఱ్ఱెలు అంటే నాకు ఇష్టం అని ఏసుప్రభువు అంటాడు. అంటే అహంభావనలో పడి, అజ్ఞానంలోపడి కొట్టుకొని పోయేవారిని చేరదీసి బాగుచేస్తాను.

కొంతమంది అంటారు మేము పది రోజులు జపంచేసాము, ధ్యానం చేసాము, ఇంకా ఎంతకాలం చేయాలి అని అంటారు. మరి మీరు రోజూ అన్నం ఎందుకు తింటున్నారు. పదిరోజులు తిని ఇంక అన్నం ఎందుకని అన్నం తినటం మానివేస్తున్నారా? లేదు. అలాగే మీరు చివర శ్వాసవరకు జపం, ధ్యానం చేస్తూనే ఉండాలి. జపం వలన, ధ్యానం వలన శరీరానికి శక్తి వస్తుంది, మనస్సుకు శాంతి వస్తుంది. నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలూక అనుభవం పొందటానికి శరీరానికి శక్తి ఉండాలి, మనస్సుకు శాంతి ఉండాలి. నిరంతరం

భగవంతుడిని స్మరించటం వలన, ఆయనను ధ్యానించటంవలన, ఆయన యొక్క ఔన్నత్యాన్ని శ్రవణం చేయటం వలన మీరు పవిత్రులవుతారు. మీరు కోరిక లేకుండా పని చెయ్యటం వలన మీ బుద్ధిలో ఉన్న దోషాలు పోతాయి, మీరు బాగుపడతారు. మీ డ్యూటీని మీరు శ్రద్ధగా చెయ్యటమే ధర్మం. మనం మోటివ్‌లెస్‌గా, డిజైర్‌లెస్‌గా పనిచేస్తూ ఉంటే చిత్తశుద్ధి కలుగుతుంది. ఈ పదిమందికి సహకారం చేస్తే మనకు ఓట్లు వేస్తారని పనిచేస్తూ ఉంటే అది మోటివ్‌లెస్‌గా, డిజైర్‌లెస్‌గా పనిచెయ్యటం కాదు. ఏదో గౌరవం ఆశించి, ఓట్లు ఆశించి నీవు పనులు చేస్తూ ఉంటే వాటి వలన లోకం నిన్ను మెచ్చుకోవచ్చుకాని నీకు చిత్తశుద్ధి కలుగదు, ఆత్మజ్ఞానానికి అర్హుడవు కాలేవు. మనకు ఇష్టమైన అవతార పురుషుడినిగాని, గురువునుగాని తీసుకునిఆయన నామాన్ని స్మరిస్తూ, ఆయన రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది, మనస్సుకు ఏకాగ్రత కలుగుతుంది. అంతఃకరణశుద్ధి ఉన్నవాడికి దాని తాలూక జిజ్ఞాస కలుగుతుంది. ఎక్కడో ఏదో ఉంది అనుకున్నాము, అది మన హృదయంలోనే ఉంది అని దానిని పొందటానికి ప్రయత్నం చేస్తాడు, అపుడు అది అనుభవంలోనికి వస్తుంది, అదే ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం కలిగాక ఇంకవాడికి పునర్జన్మ ఉండదు, ప్రకృతిని దాటి వెళ్ళిపోతాడు, వాడికి దేహంఉండటానికి, దేహం లేకపోవటానికి తేడా ఏమీ కనిపించదు, వాడు ఆత్మజ్ఞాని. అర్జునా! ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు తెలియాలంటే నాపట్ల భక్తివలననే అది సాధ్యం అన్నాడు పరమాత్మ. భగవద్గీత అర్జునుడి కోసం చెప్పలేదు. ఒక్క అర్జునుడి కోసం అయితే కర్మయోగం చెపితే చాలు కాని భక్తియోగం, ధ్యానయోగం, జ్ఞానయోగం ఇవిఅన్నీ ఎందుకు చెప్పాడంటే జీవకోటిని ఉద్ధరించడానికి అర్జునుడిని నెపంగా పెట్టుకుని చెప్పిందే భగవద్గీత. భగవంతుడే మనకు తల్లి, తండ్రి, గురువు మూడూ ఆయనే. ఆయన దయలేకుండా మనకు శాంతి కలుగదు.

ఏమనిషికి చనిపోవాలని లేదు, అందరికి ఉండాలనే ఉంది. దేహంపోతే తాను ఉండనని వాడు అనుకొంటాడు. ఈ దేహం పోయిన తరువాత కూడా తాను ఉంటానని వాడికి తెలియటంలేదు. అందుచేత దేహం కాపాడుకోవటానికి అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నాడు. ఆత్మజ్ఞానం కలిగినపుడు వాడికి సత్యం గోచరించటమే కాదు, వాడు అనంతమైన శాంతిలో, ఆనందంలో ఊగిసలాడుతూ ఉంటాడు, ఈదేహంఉన్నా లేకున్నా తాను ఉంటాను అన్న సంగతి వాడికి తెలుస్తూఉంటుంది. జ్ఞాని ప్రాణం పోయినపుడు అది హృదయగతమవుతుంది, మనం వెళితే స్వర్గానికో లేక నరకానికో వెళతాము, లేకపోతే మరల ఇక్కడకు సిద్ధమవుతాము. జ్ఞానికి రావటంలేదు, పోవటంలేదు. అంతటా తాను అయినవాడు ఎక్కడికి పోతాడు. మనం శరీరం ఎక్కడ ఉంటే అక్కడ ఉన్నాము అనుకొంటాము. మనది

శరీరగతమైన జీవితం, మనోగతమైన జీవితం, మనకు దేహబుద్ధి ఉంది కాని ఆత్మబుద్ధిలేదు. మనకు ఆత్మానుభవం కలిగినపుడు ఆత్మఅంతటా ఉంది కాబట్టి మనం అంతటా ఉన్నాము అనే బుద్ధి కలుగుతుంది. అప్పుడు కాలాన్ని, దూరాన్ని అతిక్రమిస్తాము, ప్రకృతిని అతిక్రమిస్తాము. జీవుడికి వికారాలు ఉన్నాయి, పంచభూతాలకు వికారాలు ఉన్నాయి కాని లోపల ఉన్న బ్రహ్మంకు వికారాలు లేవు, అది వికార రహితం, ఉపాధి రహితం. మీరు విసుగు వచ్చేలా సద్గురువును శ్రవణం చేయాలి, శ్రవణంచేయకపోతే ఏమీ తెలియదు. మీకు ఆత్మజ్ఞానం రాదేమో అని అనుకోవద్దు. మీకు అందరికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఇప్పడే ఇక్కడే ఈశరీరం చనిపోకముందే ఈ భూమి మీద ఉండగానే ఇంత శాంతి వస్తుందని ఎప్పడూ అనుకోలేదే అని మీరు ఊహించటానికి వీలులేనటువంటి శాంతి, స్వతంత్రమైన శాంతి మీకు అనుభవంలోనికి వస్తుంది, అది ఆత్మజ్ఞానం వలననే సాధ్యం.

మీ ఇంట్లోని వారు మిమ్మల్ని ప్రేమించవచ్చు, మీరు వారిని ప్రేమించవచ్చు కాని ఎవడూ మనవాడు కాదు, వారికి మనకు సంబంధంలేదు, దేవుడు ఒక్కడే మనవాడు, ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. భగవంతుడిని తెలుసుకొనే వరకు ఈ పుట్టుకలు, చావులు తప్పవు, ఈ యాతనలు తప్పవు. మనస్సుకు యాతనాశరీరం అని పేరు. యాతనాశరీరం ఎంతకాలం అయితే ఉందో అంతకాలం ప్రతీ జన్మలోనూ నీకు యాతనలు తప్పవు. ఖరీదైన బట్టలు వేసుకొని కారులో తిరుగుతూ ఉంటే వారిపని బాగానే ఉంది, మనకు కూడా అలా ఉంటే బాగుండును, సుఖపడవచ్చును అని అనుకొంటాము. వారు నిజంగా సుఖపడటంలేదు. జీవలక్షణాలు ఉన్నంతసేపు ఎవరికి సుఖంలేదు. వారు ఎంత దుఃఖంలో ఉన్నారో తెలియక, బాహ్యవిషయాలను చూసివారు బాగానే ఉన్నారు అని మనం అనుకొంటున్నాము, అది నిజంకాదు. వినాయకుడి బొడ్డులో ఒకడు వేలు పెట్టాడు. అక్కడ తేలు ఉంది, అది వాడిని కుట్టింది. వాడు వెంటనే వేలు తీసేసి నలుపుకొంటున్నాడు. ఏమిటి అని అడిగితే తేలుకుట్టింది అని చెప్పటానికి అభిమానం అడ్డువచ్చి, బాగానే ఉంది అన్నాడు. ఇంకొకడు వేలుపెట్టాడు, వాడిని కూడా తేలుకుట్టింది. మన జీవితాలు కూడా ఇలాగే ఉన్నాయి. మీరు బాగున్నారా అని ఎవరినైనా అడిగామనుకోండి, మేము బాగానేఉన్నాము అంటారు వారు నిజంగా బాగా లేరు. ఎప్పడూ సుఖంగా ఉండటం అనేది ఒక్క జ్ఞానికే సాధ్యం. నీకు దుఃఖ కారణం నీలోపలే ఉంది. అందులో నుండి ఎలా బయటకు రావాలో చూసుకో, దానికోసం ప్రయత్నంచెయ్యి అంతేకాని పూర్వజన్మలు తెలుసుకోవటం వలన, రాబోయేజన్మలు తెలుసుకోవటం వలన, రేపు ఏమి జరుగుతుందో తెలుసుకోవటం వలన నీకు కలిసివచ్చేది ఏమీ లేదు, అదంతా డస్టే, ఆ గొడవలోనికి వెళ్లవద్దు. చాలామంది బుద్ధుడిని నాస్తికుడు

అంటారు. అక్కడ భగవంతుడు ఉన్నాడా, లేడా అనే సమస్యకాదు. నువ్వు భగవంతుడు ఉన్నాడని నమ్ముతావు అనుకో, నువ్వు ఎప్పడూ దుఃఖంలో ఉంటున్నావు అనుకో దానివలన నీకు ప్రయోజనం లేదు. నీవు జీవించి ఉండగానే నీ హృదయంలో ఉన్న ఆత్మసుఖం వైపుకు నిన్ను తీసుకొని వెళ్ళటానికి బుద్ధుడు డైరెక్టుగా పని చేసాడు, ఆయన చర్చల జోలికి వెళ్ళలేదు. చర్చలలోనికి వెళ్ళితే అహంకారం పెరుగుతుంది. నీవు తర్కంలోనికి వెళ్ళవద్దు, తర్కం వలన సత్యం తెలియబడదు.

భగవాన్‌కు మీరు అందరూ బాగుపడటం ముఖ్యం. అంతేగాని ఏదో ఒక సిద్ధాంతం చెప్పి దూడను కట్రాడుకు కట్టినట్లుగా దానికి మీ అందరిని కట్టివేయాలనే ఉద్దేశ్యం ఆయనకు లేదు. మీరు ఏమార్గంలో ప్రయాణం చేసినా అవిద్యనుండి బయటకు రావాలి. శరీరానికి చావు ఉంది కాని సాధనకు చావులేదు. మీరు కష్టపడి ఈ జన్మలో ఎంతవరకు జపధ్యానాదులు చేసుకొన్నారో రాబోయే శరీరంలో అది కంటిన్యూ అవుతుంది. ఇలా మీరు అనేక జన్మలు సాధనచేసి మీరు పవిత్రులయితే కదా మీకు ఆత్మజ్ఞానం కలిగేది అని పరమాత్మ గీతలో చెప్పాడు. మీరు చేసిన మంచి నశించదు. మంచి చేసినవాడికి దుర్గతి లేదు అని పరమాత్మ చెప్పాడు. భగవంతుడు చెప్పిన మాటను ప్రమాణంగా పెట్టుకోండి. భగవంతుడు చేయమని చెప్పిన పనిని చెయ్యండి. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించండి, సత్వగుణాన్ని అభివృద్ధి చేసుకోండి. మీరు సాధన విడిచిపెట్టవద్దు మన శరీరం చనిపోయినపుడు దేహగతమైన చరిత్ర ముగిసిపోతుంది కాని సాధనగతమైన చరిత్ర పోదు, అది రాబోయే జన్మలో కంటిన్యూ అవుతుంది, మీరు తొందరగా తరించటానికి అవకాశం ఉంటుంది. మీరు చేసే ప్రయత్నం శ్రద్ధగా చేసుకోండి, మీకు కాలం కలిసివస్తుంది. మాకు ఆపని అవ్వలేదు, ఈ పని అవ్వలేదు అని చాలామంది కంగారుపడుతూ ఉంటారు, అది అహంకారానికి గుర్తు. వినయం, విధేయత లేకపోవటంవలన, భగవంతుని యందు గౌరవం లేకపోవటం వలన ఇటువంటివి అన్నీ వస్తున్నాయి. భగవంతుని యందు ప్రేమ కలిగిఉండాలి, భక్తి కలిగిఉండాలి. భగవంతుడి దగ్గర మనం ఉపదేశం పొందాలి కానీ మనం భగవంతుడిని ఆదేశించకూడదు. కోరిక లేకపోతే పని అవ్వదేమో అనుకొంటారు. మీ ప్రారబ్ధంలో కనుక ఉంటే కోరిక లేకపోయినా నూటికి నూరుపాళ్ళు ఆపని అవుతుంది. నీకు అంతా మంచే జరుగుతుంది, చెడ్డఏమీ జరగదు. ఎప్పడైనా ఏదైనా చెడ్డజరిగినట్లు నీకు అనిపించినా భవిష్యత్‌లో ఏదో మంచి జరగటానికే అలా చేసాడు. కాలం కలిసి వచ్చినపుడు, అనుకూల పరిస్థితులు ఉన్నపుడు అందరు బాగానే ఉంటారు. కాలం కలిసి రానపుడు, పరిస్థితులు అనుకూలంగా లేనప్పడు కూడా సహనంగా, శ్రద్ధగా, భగవంతుడి పట్ల ప్రేమగా, భక్తిగా

ఉంటే ఆ కలిసిరానికాలం కూడా భవిష్యత్‌లో రెట్టింపు కలిసి వచ్చేలా ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు. మీరు ఏవిషయానికి తొందరపడకండి, వేగిరపడవద్దు. నీ సంకల్పం మీద నీకు గౌరవం ఉంది కాని ఈశ్వరసంకల్పం మీద నీకు గౌరవం లేదు. భగవంతుడి సంకల్పం మీద నిజంగా మనకు గౌరవం ఉంటే మనలను అసలు దుఃఖం ముట్టుకోదు. మీలో ఎవరికైనా అశాంతి, దుఃఖం, టెన్షన్ వస్తూ ఉంటే మీకు భగవంతుడి సంకల్పం మీద గౌరవం లేదు అని అర్థం. ఏవో చిలుకపలుకుల్లా పలుకుతున్నాము, చదువుతున్నాము అలాకాదు. నీ సంకల్పాన్నీ తీసి ఒక ప్రక్కనపెట్టి, ఆయన సంకల్పమే నెరవేరు గాక, ఆయన ఇష్టమే నా ఇష్టం అని హృదయ పూర్వకంగా అనుకొంటే, ఆ దృక్పథం కనుక కలిగితే మరుక్షణంలోనే మిమ్మలను ఆత్మజ్ఞానంతో అలంకరిస్తాడు, వాడు ఈశ్వరుడు, వాడికి సాధ్యం కానిది ఏమీ లేదు. భగవంతుడి దయ కనుక ఉంటే మనబుద్ధితో ఆయనను అర్థం చేసుకోలేకపోయినా, రీజన్‌ను కూడా తీసి ఒక ప్రక్కనపెట్టి ఆయన దయాసముద్రాన్ని మనమీద కురిపిస్తాడు, వాడు ఈశ్వరుడు. ఆయన కుంటివాడిని పరిగెత్తించగలడు, కొండలు ఎక్కించగలడు, మూగవాడిచేత మాట్లాడించ గలడు, కళ్ళులేనివాడికి చూపును ప్రసాదించగలడు, ఇవన్నీ చేసేవాడే మిమ్మల్ని జ్ఞానంతో అలంకరిస్తాడు.

నిన్ను ఒక మార్గంలో ప్రయాణంచెయ్యమని చెప్పను, నీకు ఇష్టమైన మార్గంలో, నీమనస్సుకు తేలికగా ఉన్న మార్గంలో ప్రయాణం చెయ్యి అంటున్నారు భగవాన్. భక్తి అంటే అంత తేలిక అని మీరు అనుకోవద్దు. ఎంతో కష్టపడితేనే గాని అదిరాదు. ఈరోజు మీరు ఇక్కడ కూర్చొని శ్రవణం చేస్తున్నారు అంటే పూర్వజన్మలలో ఎంతో కొంత సాధన చేసారు కాబట్టి మీకు శ్రవణయోగ్యం వచ్చింది లేకపోతే నేను చెప్పినా మీరు వినరు. ప్రతీ శరీరం ఏదో రోజు మరణిస్తుంది. జ్ఞానం కలిగే వరకు సాధన మరణించదు. ఈ శరీరం మరణించేలోపు ఇప్పుడు మీకు ఈ శరీరంతో ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ లోపల ఉన్న బ్రహ్మంతో మీకు తాదాత్మ్యం రావాలి, అపుడు మీరు తరిస్తారు. ఏదో స్వర్గలోకంలోనికి వెళ్ళటంకాదు, వెళ్ళినా అక్కడ కొన్ని భోగాలు అనుభవిస్తారు తిరిగి ఈ భూమిమీదకు రావలసిందే. గోయింగ్ ఎప్పుడైతే ఉందో కమింగ్ కూడా ఉంటుంది, అది ముఖ్యంకాదు. ప్రాణంపోయేటప్పుడు, అదే చివరి శ్వాస అనుకోండి, అప్పుడయినా ఆచుట్టం వచ్చాడా, కూతురు వచ్చిందా అని అలా చూసుకొంటూ ఉంటారు, అది కాదువయ్యా, కనీసం ప్రాణంపోయే టైములో అయినా లోపల ఉన్న బ్రహ్మంతో నీవు తాదాత్మ్యం పొందితే నీవు తరిస్తావు. అక్కడ తోటి ఈ అహంకారగతమైన జీవితం ముగిసి పోతుంది. ఇంట్లో ఉన్న మనుషులు సంసారం కాదు, వారికి మనకు అసలు సంబంధంలేదు. మన ప్రారబ్దాన్నిబట్టి

వారు, వారి ప్రారబ్దాన్నిబట్టి మనం సిద్ధమయ్యాము అంతే. ఏవో కొన్ని సంవత్సరాలు కలిసి ఉంటాము. వారిపట్ల మన డ్యూటీ ఏదో మనం చేయాలి, మన పట్ల వారి డ్యూటీ ఏదో వారు చేయాలి కాని లోపల ఇది ఏమీ నిజంకాదు అనుకొంటూ డ్యూటీ చేస్తూ దేహం చనిపోయేలోపు మన హృదయంలో ఉన్న సద్వస్తువుతో తాదాత్మ్యం పొందాలి. ఒకోసారి మీరు వందకోట్లు సంపాదించి మీ వారసులకు ఇచ్చినా వారు మీకు తద్దినం కూడా పెట్టరు, ఇదీలోకం. మీరు పని దొంగలు కావద్దు, మీడ్యూటీ మీరు చెయ్యండి కానీ హృదయాంతరాళాలలో వీరు నావారు కాదు, నేను ఆత్మకు సంబంధించిన వాడిని, వీరికి నాకు ఏమాత్రం సంబంధం లేదు అనే ఎరుక కలిగి ఉండండి. మీ ప్రాణప్రయాణ సమయంలో ఆ చివరి శ్వాసలో అయిన లోపలఉన్న సద్వస్తువుతో కనుక తాదాత్మ్యం వస్తే అపుడు కదా మీబతుకుకు సాఫల్యం అంటున్నారు. కుటుంబసభ్యులపట్ల డ్యూటీ ఏదో మీరు చెయ్యండి, వారు బాగుపడవచ్చు, బాగుపడకపోవచ్చు. భగవంతుడు మీకు ఏవైనా అవకాశములు ఇస్తే దాని ద్వారా ఎదుటివారికి సేవచేసినా, సమాజానికి సహాయపడినా అది భగవంతుడికి నివేదనగా చేయండి. స్వాతిసయం పెట్టుకోవద్దు, నీవు ఏదో మంచిపనిచేసి గర్వపడుతూ ఉంటే అది పైకి బాగానే ఉన్నా నీవు లోపల కుళ్లిపోతావు.

ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండండి. ఉప్పు, కారం తగ్గించండి. పేగులను ఉద్రేకపడనివ్వవద్దు. శారీరకఆరోగ్యం సరిగా లేకపోతే మీ బుద్ధి భగవంతుడిని స్మరించటం మానివేసి దేహం దగ్గర ఆగిపోతుంది, దేహానికి పరిమితమై పోతుంది. మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకొంటూ వాటిని ఉపయోగించుకొని ఆత్మజ్ఞానం పొందటానికి ప్రయత్నం చెయ్యండి. మీ శరీరానికి పడని వస్తువును ఎండ్రిన్‌తో సమానంగా వదిలివేయండి. మీ శరీరం కూడా మీకు గురువే. మీరు ఆహారం తినేటప్పుడు మీకు ఎంతవరకు అవసరమో శరీరం చెపుతూ ఉంటుంది, అపుడు మానేయండి. శరీరం చెప్పినప్పటికి వినకుండా రుచికోసం ఎక్కువ తినకండి. ముందు బాహ్య విషయాల స్మరణ ఆపుచెయ్యి. సృష్టిలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. లోకంలో ఉన్న ఆకర్షణలలోనికి వెళ్లకుండా నీమనస్సును ఆపుచెయ్యి. వస్తుస్మరణ, విషయస్మరణ లేకుండా నీమనస్సును నిరోధించు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. నీమనస్సును తీసుకొనివెళ్లి అక్కడ పెట్టు, అప్పడు నీమనస్సు కరిగిపోతుంది. మనస్సు నీవు కాదు అందుచేత సాధన చేస్తే అది కరిగిపోతుంది, అదే నువ్వు అయితే సాధనచేసినా అది పోదు. అశాంతి, దుఃఖం, వేదన, రోదన ఇవి అన్నీ కూడా దేహంతో తాదాత్మ్యం పొందే నేనుకు వస్తున్నాయి. ఈ నేను మీరుకాదు అని నోటితో చెప్పటం కాదు, అది మీకు అనుభవంలో తెలిసినప్పడు మీకు దుఃఖస్పర్శ కూడా

ఉండదు, దుఃఖరహితస్థితిని పొందుతారు. దేవుడు ఉన్నాడా లేడా, మీరు మంచివారా చెడ్డవారా ఇటువంటి గొడవలలోనికి వెళ్ళకుండా మిమ్మల్ని డైరెక్టుగా ఆనందసముద్రంలో, శాంతిసముద్రంలో ముంచటానికి బుద్ధుడు ప్రయత్నం చేసాడు, మానవజాతి మీద హద్దులులేని ప్రేమ ఆయనది. సమాజపరిస్థితులు ఇలా ఉన్నాయి ఏమిటి అని భగవాన్‌తో అంటే ఈ సమాజాన్ని దేవుడికి వదిలెయ్యి. నీవు పుట్టక ముందు ఈ సమాజం ఉంది, నీవు చనిపోయిన తరువాతకూడా ఈ సమాజం ఉంటుంది. సమాజాన్ని ఉద్ధరిస్తున్నామని చెపుతూ అహంకారాన్ని పెంచుకొంటున్నారు. ముందు నీవు చేసుకొనే ప్రయత్నం ఏదో చేసుకొని తరించు, ఆత్మజ్ఞానాన్ని పొందు. సమాజానికి ఏది ఆధారంగా ఉందో, నీకు ఈ సృష్టికంతా కూడా అదే ఆధారంగా ఉంది, నీవు దానిని పొందు. నీద్వారా జరగవలసింది ఏదో అది జరుగుతుంది, అది నీకు సంబంధంలేదు. నీవు జ్ఞానాన్ని పొందకుండా, సుఖస్థితిని పొందకుండా, నీ స్వరూపాన్ని నీవు పొందకుండా సమాజాన్ని ఏమి ఉద్ధరిస్తావు. నీ అజ్ఞానాన్ని అవిద్యను సమాజానికి పంచిపెడతావా. ఇంట్లో ఏడవటం మానివేసి వీధిలోకి వచ్చి ఏడ్చి, నీ దుఃఖాన్ని, అశాంతిని సమాజానికి పంచిపెడతావా. చాలా మంది ఎలా ఉంటారు అంటే పరిస్థితులు బాగుంటే వచ్చిన సుఖాన్ని వారే అనుభవిస్తారు, పరిస్థితులు బాగాలేకపోతే, వచ్చిన దుఃఖాన్ని సమాజానికి పంచిపెడతారు, ఎంత గొప్పవారో చూడండి. కాలగతి ఎప్పడూ ఒకలాగ ఉండదు. కాలగతి నీకు అనుకూలంగా ఉన్నప్పడు ఎలా ఉన్నావో, ప్రతికూలంగా ఉన్నప్పడు ఎలా ఉన్నావో ఈశ్వరుడు చూస్తూ ఉంటాడు, దానిని బట్టి మార్కులు వేస్తాడు. కొంతమంది కాలం అనుకూలంగా ఉంటే పొంగిపోతారు, కాలం ప్రతి కూలంగా ఉంటే కుంగిపోతారు. ఇంత హెచ్చుతగ్గులు ఉన్న మీకు జ్ఞానం ఇవ్వటానికి భగవంతుడు ఏమైనా అమాయకుడా, ఆయన సర్వజ్ఞుడు, సర్వ శక్తిమంతుడు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నీవు నిర్మలంగా ఉండగలిగితే ఆయన దయ మనమీద వర్షిస్తుంది.

జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషిప్తవస్థ ఈ మూడూ అసత్యం, ఈ మూడు అవస్థలకు సాక్షిగా ఉన్నవాడు మాత్రం నిజం. గాఢనిద్రలో మన మనస్సు తన మూలమైన హృదయం లోనికి వెళ్ళిపోతుంది. మనం జాగ్రదవస్థలో ఉండగా ప్రయత్నం చేసి ఎరుకతోటి మన మనస్సును హృదయంలోనికి పంపగలిగితే, అక్కడ ఉంచగలిగితే మనస్సు నశిస్తుంది, మనకు బ్రహ్మానుభవం కలుగుతుంది. భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి దేవుడు లేడు అని చెపుతున్నారు. దేవుడులేడు అని ఎవరు చెపుతున్నారు అని భగవాన్ అతనిని అడిగారు. నేనే చెపుతున్నాను అన్నాడు. దేవుడు లేడని నీవు ఉండి చెపుతున్నావా, నీవు లేకుండా చెపుతున్నావా అన్నారు. నేను ఉండే చెపుతున్నాను అన్నాడు. ఆ ఉండటమే దేవుడు అన్నారు భగవాన్. నీకు ఏమార్గం

నచ్చుతుందో ఆ మార్గంలో ప్రయాణం చెయ్యి, ఇతరులను ఏ విషయంలోనూ అనుసరించవద్దు. ప్రతీదీ కాల ప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. పెద్దపెద్ద సామ్రాజ్యాలే కాలప్రవాహంలో కొట్టుకొనిపోయాయి. మనకు డబ్బు ఎక్కువ ఉందా, లేదా అనేది ముఖ్యం కాదు. ఫైనాన్షియల్ డిసిప్లెన్ లేనప్పడు నీకు వెయ్యికోట్లు ఉన్నా నీకు సుఖం లేదు. నీవు ఏదైనా చేసినప్పడు కలిసిరాకపోతే అది వేరే విషయం కాని ఇప్పడు దేశంలో చాలామంది దారిద్ర్యాన్ని కొనితెచ్చుకొంటున్నారు. ఆర్థిక పరమైన క్రమశిక్షణ మీకు ఉందో, లేదో అది చూసుకోండి. కాలప్రవాహంలో మన శరీరమే పోతుంది, డబ్బు పోవటంలో ఆశ్చర్యం ఏముంది. నేర్చుకొన్నవి, తెచ్చిపెట్టుకొన్నవి ఏవీ సహజంకాదు. ఏదైతే నిర్మలంగా, సహజంగా ఉంటుందో, దేని స్వరూపం అయితే ఆనందమో అది మాత్రమే ఎప్పడూ ఉంటుంది కాని మన ఇంద్రియాలతోటి, మనస్సుతోటి, బుద్ధితోటి నేర్చుకొన్నవి ఒక కాలంలో నేర్చుకొంటాము, ఇంకో కాలంలో పోతాయి. నేర్చుకొన్నది అంతా మానవుడు మర్చిపోవలసిందే ఎందుచేతనంటే అది నిజం కాదుకాబట్టి. పెద్దమర్రిచెట్టు అంతా చిన్న విత్తనంలో ఎలా ఇమిడిఉందో అలాగ మొత్తం ఖగోళం అంతా కూడా ఈ జన్మలు, పుణ్యాలు పాపాలు, స్వర్గాలు నరకాలు ఇవి అన్నీకూడా దేహము నేను అనే మూలతలంపు మీద ఆధారపడి ఉన్నాయి. మర్రి విత్తనంలో నుండి పెద్ద చెట్టు ఎలా వస్తోందో అలాగ నేను అనే మూలతలంపులో నుండి ఇవి అన్నీ వస్తున్నాయి. ఏది వచ్చిన తరువాత ఇవి అన్నీ వస్తున్నాయో దానిని విచారణ చేసి తొలగించుకొంటే నీపని పూర్తి అయిపోతుంది. గ్రహాల గొడవలు, నక్షత్రాల గొడవలు, మహిమల గొడవలు ఇవి ఏమీ వద్దు. నీ మనస్సును అక్కడ ఆపుచెయ్యవద్దు, నీవు ఏదైతే పొందాలో దాని మీద నీ మనస్సును గురిపెట్టు. మనకు ఏదో సంకల్పం వస్తూ ఉంటుంది కదా దానిని తీసి ఒక ప్రక్కనపెట్టి, భగవంతుడి సంకల్పాన్ని అక్కడ పెట్టు, అదే శరణాగతి.

గజేంద్రమోక్షంలో మొసలి ఏనుగును ఎంత గట్టిగా పట్టుకొందో ప్రతీమనిషిని వాడి అహంకారం అంత గట్టిగా పట్టుకొంది. ఎంతటివారైనా అహంకార దాసులేకదా. ఇప్పటివరకు ఎవరికోసం అయితే జీవించిందో, ఎవరికి సహాయం చేసిందో ఆ ఏనుగులు అన్నీ ఒడ్డుకు వచ్చేసాయి. కష్టం వచ్చినప్పడు అన్నీ వదిలేసాయి, మనుషులు కూడా అంతే. మనకు చాలామంది స్నేహితులు ఉన్నారు అనుకోండి కష్టం వచ్చినప్పడు అందరూ మనలను వదిలేస్తారు, మన గురించే గజేంద్రమోక్షం కథ చెప్పారు. ఇది జీవుడి పరిస్థితి, ఇది మానవ స్వభావం, ఇది తెలుసుకొని మనం జీవించాలి. భగవాన్ అయితే ఈ గోల నీకెందుకు, ఏదైతే పొందాలో నీ మనస్సును తీసుకొనివెళ్ళి దానిమీద పెట్టు అంటారు. ఇటువంటి విషయాలు ఎందుకు చెపుతున్నాను అంటే లోకానుభవం కోసం చెపుతున్నాను, కష్టకాలం

